# శిక్షణతో పాటు ఉపాధి

## జహీరాబాద్‌కు హోటల్ మేనేజ్‌మెంట్ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల మంజూరు

- నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు, తల్లిదండ్రులు



కవేలి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల

కోహీర్, అక్టోబర్ 6: బీసీ యువతులకు శిక్షణ నందించి ఉపాధిమార్గం చూపించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా జహీరాబాద్ నియోజకవర్గానికి మహాత్మా జ్యోతిబాపూలే హోటల్ మేనేజ్‌మెంట్ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. కోహీర్ మండలంలోని కవేలి జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా తరగతులు ప్రారంభించనున్నారు. పలు ప్రాంతాలకు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలల్లో హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఇంటర్ పూర్తి చేసిన బీసీ విద్యార్థినులకు బీఎస్సీ డిగ్రీ కోర్సులో మూడు సంవత్సరాలపాటు శిక్షణనివ్వనున్నారు. శిక్షణ పొందిన యువతులకు పలు ప్రాంతాల స్టార్ హోటళ్లు, విమానాలు, బేకరీల్లో ఉపాధి కల్పించనున్నారు. తమ ప్రాంతానికి మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేసినందుకు విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**తరగతుల నిర్వహణకు అనుకూలం**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని కవేలి జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనంలో శనివారం మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభించనున్నారు. 2017లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.12కోట్ల వ్యయంతో 5ఎకరాల్లో అద్భుతమైన భవనాన్ని నిర్మించారు. హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా 2017, ఆగస్టు 3న ప్రారంభించారు. 2017-18లో బీఎస్సీలో 15 మంది, 2018-19లో 14 మంది, 2019-20లో 7మంది జాయిన్ అయ్యారు. మొత్తానికి మూడు సంవత్సరాల బీఎస్సీ కోర్సుతో పాటు 18నెలల క్రాఫ్ట్ కోర్సును అందించారు. ఇందులో కూడా పలు రాష్ట్రాలకు చెందిన 15మంది యువత శిక్షణ పొందారు. కానీ కరోనా ప్రభావంతో కళాశాలలో రెండేండ్లుగా ఎవరూ జాయిన్ కాలేదు. విషయం తెలుసుకొన్న మంత్రి హరీశ్‌రావు బీసీ యువతులకు శిక్షణ కోసం మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో శనివారం మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలను మంత్రి ప్రారంభించనున్నారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం సహృదయంతో తీసుకొన్న ఈ నిర్ణయంతో బీసీ విద్యార్థినులకు ఎంతగానో మేలు కలుగనున్నది.

### భవనం సిద్ధంగా ఉంది




హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శిక్షణ పొందడానికి భవనం సిద్ధంగా ఉంది. 60మందికి సరిపడే విధంగా హాస్టల్ భవనం ఉంది. తాగునీరు, కరెంటు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి. హౌస్ కీపింగ్, కిచెన్ రూమ్, ఫ్రంట్ ఆఫీస్, బేకరీ, తదితర ఎనిమిది రకాల అంశాల్లో శిక్షణ పొందవచ్చు. శిక్షణ తీసుకున్న ప్రతిఒక్కరికీ కచ్చితంగా ఉపాధి లభిస్తుంది.

**- వినయ్‌కుమార్‌రెడ్డి,**
**హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల సిబ్బంది**

# నేడు జువైనల్ జస్టిస్ శానిటైజేషన్

మెదక్ అర్బన్, అక్టోబర్ 7: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ పి.లక్ష్మీశారద ఆధ్వర్యంలో శనివారం జిల్లా న్యాయస్థానముల సముదాయంలో జువైనల్ జస్టిస్ బోర్డ్ శానిటైజేషన్ కార్యక్రమం విత్ స్టాక్ హోల్డర్స్ కార్యక్రమం ఉంటుందని శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మెదక్ కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, శాలినీ జువైనల్ జస్టిస్ బోర్డ్ సంగారెడ్డి వస్తున్నట్లు పేర్కొన్నారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


భన్యానాయక్(ఫైల్)

చిలిపిచెడ్, అక్టోబర్ 6: పొలం వద్ద బోరు మోటర్ పని చేయకపోవడంతో స్టార్టర్ రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చిలిపిచెడ్ మండలంలోని గన్య తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. తండా ప్రజలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్య తండాకు చెందిన గుగ్లోత్ భన్యానాయక్(52) విద్యుత్ షాక్‌తో తన వ్యవసాయ పొలం వద్ద మృతి చెందినట్లు తెలిపారు. ఇతడికి ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. తమ్ముడు అంజ్యానాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# సోమలింగంగౌడ్ విగ్రహావిష్కరణ

మెదక్ అర్బన్, అక్టోబర్ 6: మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్ పట్టణంలో మొదటి మున్సిపల్ చైర్మన్ సోమలింగంగౌడ్, కామ్రేడ్ కేవల్ కిషన్ విగ్రహాలను శుక్రవారం ఆవిష్కరించారు. మెదక్ పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్లకు వివిధ చోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, జయరాజు, ఆర్కే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


మెదక్ మొదటి మున్సిపల్ చైర్మన్ సోమలింగంగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

# నేడు జహీరాబాద్‌లో మెగా జాబ్ మేళా

జహీరాబాద్, అక్టోబర్ 6: నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు, రైల్వే బోర్డు సభ్యుడు షేక్ ఫరీద్ తెలిపారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాలులో మెగా జాబ్ మేళా ఉంటుందని శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. జాబ్ మేళాకు ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ, అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, టీఎస్‌టీపీసీ చైర్మన్ భిక్షపతి, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్ హాజరవుతారని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 50 కంపెనీలు హాజరవుతున్నాయని పేర్కొన్నారు. టాటా మోటార్స్, ఐఫోన్స్, ఐఫోన్ సంస్థ, ఎయిర్‌టెల్, అపోలో గ్రూప్స్, మోటోరోలా, ఐసీఐసీఐ బ్యాంకు, వరుణ్ మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ, బీవైజేయూఎస్, టెక్ ఫైండర్, 7టెక్ ఐటీ సొల్యూషన్స్ వంటి కంపెనీలు హాజరవుతాయని వివరించారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపికైన వారికి వెంటనే జాబ్ లెటర్ ఇస్తారన్నారు.

# చిన్నకోడూరులో ఏకగ్రీవ తీర్మానాలు


తీర్మాన ప్రతిని అందుకుంటున్న జడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ

చిన్నకోడూర్, అక్టోబర్ 6: గత ఎన్నికల్లో అన్ని మండలాల కంటే చిన్నకోడూరు ఎక్కువ మెజారిటీ ఇచ్చిందని, అదే పంథాలో ఈ ఎన్నికల్లోనూ భారీ మెజారిటీ హరీశ్‌రావుకు ఇస్తామని జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. చిన్నకోడూర్ మండలం కమ్మర్లపల్లి గ్రామ యాదవ సంఘం, సికిం ద్లాపూర్ గ్రామ రెడ్డి సంఘం హరీశ్‌రావుకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేసి అందించారు. చిన్నకోడూర్ మండలం బైండ్ల సంఘం, ఈవెంట్స్ అసోసియేషన్ మండల సంఘం హరీశ్‌రావుకు మద్దతు ప్రకటించారు. సర్పంచ్ ఉమేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

సిద్దిపేట, అక్టోబర్ 6: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. సిద్దిపేట పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పట్టణంలోని 21 ప్రభుత్వ పాఠశాలకు క్రీడా వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. క్రీడా ప్రాంగణాలున్న ప్రభుత్వ పాఠశాలకు ఆట వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందజేసే స్పోర్ట్స్ కిట్‌లో టీ షర్ట్స్, క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్, వ్యాయామానికి సంబంధించిన డంబెల్స్ ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.


క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

# ప్లాస్టిక్‌రహిత పంచాయతీకి సహకరించాలి

సిద్దిపేటరూరల్, అక్టోబర్ 6: ప్లాస్టిక్ రహిత పంచాయతీకి గ్రామస్తులంతా సహకరించాలని మాచాపూర్ సర్పంచ్ పంజ భాగ్యలక్ష్మీబాలయ్య కోరారు. శుక్రవారం మంత్రి హరీశ్‌రావు సహకారంతో ఉపాధి హామీ కూలీలకు బ్యాగ్, టిఫిన్‌బాక్స్, వాటర్ బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రం, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


వాటర్ బాటిళ్లు అందజేస్తున్న సర్పంచ్ భాగ్యలక్ష్మి

# మహిళలకు బతుకమ్మ కానుక


బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట, అక్టోబర్ 6: ఆడబిడ్డలకు ప్రభుత్వం బతుకమ్మ కానుకగా చీరలను పంపిణీ చేస్తున్నదని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని 43వ వార్డులో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, స్థానిక వార్డు కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమాఎల్లంతో కలిసి మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, అర్బీలు పాల్గొన్నారు.

**సిద్దిపేట రూరల్ మండలంలో..**

సిద్దిపేటరూరల్, అక్టోబర్ 6: సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్, మాచాపూర్, తోర్నాల, పుల్లూరు తదితర గ్రామాల్లో శుక్రవారం బతుకమ్మ చీరలను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గన్నమనేని శ్రీదేవీ రాంచందర్‌రావు, జడ్పీటీసీ శ్రీహరిగౌడ్, వైస్.యాదగిరి, సర్పంచ్‌లు నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటరూరల్: రాఘవాపూర్‌లో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, జడ్పీటీసీ శ్రీహరిగౌడ్